
కథ




# ప్రతిభ

— రావిపల్లి నారాయణరావు

బెంగళూరు కాన్ఫరెన్స్‌కు హాజరై, యశ్వంత్‌పూర్ —హౌరా ఎక్స్‌ప్రెస్‌లో తిరుగు ప్రయాణం కట్టిన నేను, సెకెండ్ ఏసీలో కూర్చున్నాను. సీనియర్ సిటిజన్స్‌కు లోయర్ బెర్త్ ఇవ్వాలన్న రూలు లేకపోయినా, కొంతవరకు కన్సిడర్ చేసే అవకాశం ఉందన్న నమ్మకం నాకుంది. కాని నాకు అలవాటైంది అప్పర్ బెర్త్. ఇంతకు ముందులా ఉన్నట్టయితే శ్రమపడి పై బెర్త్ ఎక్కి పడుకునే వాడినే... కాని ఉదయం లేవగానే నా నడుం పట్టింది. నిలబడితే కూర్చోలేను. కూర్చుంటే నిలబడలేను. చాలా కష్టంగా ఉంది. ఈ పరిస్థితుల్లో పై బెర్త్ ఎక్కగలనా అన్న సందేహం. ఏం చేయాలో తోచలేదు. టైమ్ ఏడు ఇరవై. ఇంకా పది నిముషాల్లో బండి బయల్దేరుతుంది.

ఇంతలో ఒక ఆమె చిన్న బ్యాగ్, సూట్ కేసు పట్టుకుని వచ్చి నన్నడిగింది—బెర్త్ నంబరు పదకొండు ఇదేనా అని. అవునన్నట్టు తల ఊపాను నేను. సీటు కింద లగేజ్ పెట్టి ఆమె నా ఎదుటి సీట్లో కూర్చుంది.

ఆమె సభ్యత, సంస్కారం కొట్టొచ్చినట్టు కనిపించాయి.

బండి కదిలి వేగాన్ని పుంజుకుంది.

మనుషుల్లో భిన్నమనస్తత్వాలు కలవారు అప్పుడప్పుడు మనకు తారసపడుతుంటారు. ముక్కు మొహం తెలియనివారైనా ఎదుట పడ్డ కొన్ని క్షణాల్లోనే, మాటల్లోకి దించేస్తారు కొందరు. సన్నిహితుల్లా వారిపై ప్రేమాభిమానాలు వొలకబోస్తారు. రోజులు, ఋతువులు కాలగర్భంలో కలిసిపోయినా, పొరుగింటివారితో కూడా పరిచయం చేసుకోరు మరి కొందరు. ఎదుటి సీట్లో కూర్చున్న ఆమె పేరేవిటో తెలీదు. వయస్సులో ఆమెకూ, నాకూ తండ్రీకూతుళ్ల మధ్య ఉండే వ్యత్యాసముంది. ఆమెతో నేనే ముందు పరిచయం చేసుకోవాలని తలచాను. కాని సభ్యత అడ్డొచ్చింది. ఆమెకు రిజర్వయింది లోయర్ బెర్త్. నాకు ఇచ్చింది అప్పర్ బెర్త్. చదువుతున్న పుస్తకం పక్కన పెట్టి, ఆమె నా వైపు తిరిగింది.

''నా పేరు మాలతి, నేను వైజాగ్ వెళ్తున్నాను'' ఆమె చెప్పింది.

''గ్లాడ్ టు మీట్ యూ.. నేను విజయవాడలో ఉంటున్నాను. అయితే ఇప్పుడు నేను డైరెక్టుగా విశాఖపట్నం వెళ్తున్నాను. చెప్పటం మరిచా, నా పేరు చక్రపాణి, రిటైర్డు ప్రిన్సిపాల్'' చెప్పాను నేను.

''అందుకే గాబోలు, మిమ్మల్ని చూస్తుంటే విశాఖలో పని చేసిన మా ప్రొఫెసర్ బాబాయిగారు గుర్తుకొస్తున్నారు!'' నవ్వింది మాలతి.

'ఎవరు? ఆయన పేరు?' అడిగాను.

'డాక్టర్ రామశర్మ.'

'రామశర్మగారి గురించా నువ్వు చెబుతున్నావ్? ఆయన మొదట విజయవాడలో లెక్చరర్‌గా పని చేశారు. ఉద్యోగం చేస్తూనే ఆయన స్వచ్ఛందసేవాకార్యక్రమాల్లో కూడా పాల్గొనేవారు. ఆయన ఉపన్యాసాలు వినటానికి అక్షరాస్యులే కాదు, నిరక్షరాస్యులు కూడా హాజరవుతూ ఉండేవారు. ఏ అంశం తీసుకున్నా —స్త్రీవిద్య, దాని ప్రాముఖ్యం—గురించి ప్రస్తావించకుండా ఆయన

ఉపన్యాసం ముగించేవారు కాదు' చెప్పాను నేను.

'అవును బాబాయిగారూ! సారీ బాబాయిగారూ అన్నాను క్షమించండి.'

'క్షమించటం ఎందుకమ్మా, నువ్విప్పుడు చేసిన తప్పేమిటి? నాకు ఇద్దరు కూతుళ్లు. నువ్వూ మా అమ్మాయి ల్లాగే కనిపిస్తున్నావ్. బాబాయంటే తప్పేంటి? ఆ నువ్వు ఏదో చెప్పబోతున్నట్టున్నావ్. కేరీ ఆన్.'

'నేటి సమాజంలో ముఖ్యంగా, మన గ్రామాల్లో స్త్రీవిద్యను ప్రోత్సహించేవారు అరుదుగా కనిపిస్తారు. ఆడపిల్లలకు చదువెందుకు, ఏదైనా పనిలోకి పంపితే నాలుగు రాళ్లు సంపాదించుకు వస్తారన్న భావం ప్రజల గుండెల్లో నాటుకుపోయిందని, ఈ అభిప్రాయాన్ని తొలగించటానికి రామశర్మగారు నడుం బిగించేవారని, చెప్పుకోటం నేను విన్నాను' చెప్పింది మాలతి.

'అవునమ్మాయి. నేనూ విన్నాను. ఈ సబ్జక్టు గురించి మాట్లాడుతుంటే మరో బాల్యమిత్రుడు నా గుర్తు కొస్తున్నాడు. ఇటువంటి విషయం ప్రస్తావించిన ప్రతిసారీ వాడు వాదానికి దిగేవాడు. తనకి ఇద్దరో, ముగ్గురో అమ్మాయిలు. అమ్మాయిల్ని స్కూలుకు పంపటానికి సుతరామూ ఇష్టపడేవాడు కాదు. ఇంటి గుమ్మం దాటితే ఆడపిల్ల జీవితం అన్యాయమైపోతుందని నాతో ఆర్గ్యూ చేసేవాడు. కొన్ని వందల సంవత్సరాల కింద మన దేశంలో నెలకొన్న పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని వాడట్లా వాదించేవాడని, నేను సరిపెట్టుకునేవాడిని. స్త్రీ విద్యావంతురాలైతే సమాజం వివేకవంతం అవుతుంది. అటువంటి సమాజం దేశంలోని సాంఘిక ఆర్థికపరిస్థితులను ప్రభావితం చేస్తుంది. నేను అదే విషయాన్ని నా మిత్రుడికి బోధించేవాడిని.'

'బాబాయి గారు అనుభవజ్ఞులు. నేను ఒక పేజీలో కూడా వివరించలేని విషయాన్ని మీరు ఒక వాక్యంలో విశదీకరించారు' అంది మాలతి.

టికెట్ చెకింగ్‌కు టీసీ రావటంతో, మా సంభాషణకు అంతరాయం కలిగింది. టికెట్ చూపించిన తర్వాత నా పరిస్థితి చెప్పి, లోయర్ బెర్త్ ఇప్పించమని టీసీని కోరాను. ప్రస్తుతం ఖాళీలు లేవనీ, ఎవరితోనైనా ఎక్స్చేంజ్ చేసుకుంటే తనకు అభ్యంతరం లేదనీ చెప్పి, అతను ముందుకెళ్లాడు.

'బాబాయి గారూ, మీరు వర్రీ కావద్దు, నాది ఈ కింద బెర్తే కదా, నేను పైన పడుకుంటాను, మీరు ఈ కింద బెర్తులో నిద్రపొండి నిర్చింతగా.'

'థేంక్యూ మాలతీ!' అన్నాను నేను.

'భలేవారే బాబాయి గారూ, మీరు నాకు థేంక్స్ చెప్పాలా?'

చేతిలో పుస్తకం మడిచి బ్యాగ్‌లో సర్దింది. ఆ తర్వాత కొంత సేపు సాంఘికసంక్షేమం, ప్రస్తుతవిద్యావిధానం మొదలైన విషయాలగురించి అనర్గళంగా మాట్లాడింది మాలతి. కాని తన క్వాలిఫికేషన్, చేస్తున్న ఉద్యోగం గురించి ఆమె ప్రస్తావించలేదు.

టైమ్ తొమ్మిది దాటింది. డిన్నర్ పూర్తి కాగానే గుడ్ నైట్ చెప్పి పై బెర్త్ మీదకు వెళ్లింది మాలతి.

'బాబాయి గారూ, మీరు వర్రీ కావద్దు, నాది ఈ కింద బెర్తే కదా, నేను పైన పడుకుంటాను, మీరు ఈ కింద బెర్తులో నిద్రపొండి నిర్చింతగా.'
'థేంక్యూ మాలతీ!' అన్నాను నేను.
'భలేవారే బాబాయి గారూ, మీరు నాకు థేంక్స్ చెప్పాలా?'
చేతిలో పుస్తకం మడిచి బ్యాగ్‌లో సర్దింది. ఆ తర్వాత కొంత సేపు సాంఘికసంక్షేమం, ప్రస్తుత విద్యావిధానం మొదలైన విషయాలగురించి అనర్గళంగా మాట్లాడింది మాలతి.

000

ఉదయం తొమ్మిదిన్నరకు మా ట్రెయిన్ విజయవాడ చేరింది. ఒరిజినల్ ప్రోగ్రామ్ ప్రకారం, నేను విజయవాడలో దిగాలి. కాని అర్జెంటుగా వైజాగ్‌లో లాయర్ని కలుసుకోవలసిన పని ఉంది. అందువల్ల జర్నీ వైజాగ్ వరకు పొడిగించాను.

రైలు విజయవాడ స్టేషన్లో ఆగడంతో, మా ఇద్దరు అమ్మాయిలూ ఏసీ కోచ్ లోపలికొచ్చి, కాసేపు కూర్చున్నారు.

ఎదుటి సీట్లో ఉన్న మాలతికి, అమ్మాయిలను పరిచయం చేశాను. వారి చదువు, ఉద్యోగాల గురించి అడిగింది మాలతి. పెద్దమ్మాయి పి.జీ. చేసి స్థానికకళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తోంది. రెండో అమ్మాయి ఎమ్.ఫిల్. చేసింది. ప్రయివేట్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉంది. పిల్లలు, మాలతితో చాలా చనువుగా మాట్లాడారు. ఆమె అడిగిన ప్రశ్నలకు బిడియం లేకుండా సమాధానాలిచ్చారు. బండి కదిలే టైము దగ్గర పడడంతో, పిల్లలు, మాలతికీ, నాకూ 'బై' చెప్పి రైలు దిగారు.

'బాబాయిగారూ! మీరు చాలా అదృష్టవంతులు. పిల్లలకు పి.జీ. చెప్పించారు. వాళ్ల అదృష్టమో, మీ ప్రోత్సాహమో, మంచి ఉద్యోగాలు వారిని వరించాయి. మీ అభిరుచికి నా జోహార్లు. మీలా ప్రతి తండ్రీ శ్రద్ధ తీసుకుని ఆడపిల్లలను చదివించి ఉంటే, మన దేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధించి ఉండేదని నా అభిప్రాయం' అంది మాలతి. నేను ఆనందం పట్టలేకపోయాను.

పిల్లలు దిగి వెళ్లిన రెండు నిముషాలకే రైలు కదిలి, వేగాన్ని అందుకుంది. మాలతి పుస్తకం చదవటంలో లీనమైపోయింది. కళ్లు మూసుకుని రిలాక్స్ అవటానికి వెనక్కి చేరబడ్డాను నేను.

000

ఆ సాయంత్రం విశాఖపట్నంలో రైలు ఆగగానే, ''వెళ్లొస్తా బాబాయిగారూ!'' అంటూ లగేజ్ పుచ్చుకుని ప్లాట్‌ఫాం వైపు దారి తీసింది మాలతి.

సీటు కింద పెట్టిన బ్రీఫ్ కేసు, ట్రావెలింగ్ బ్యాగ్ పట్టుకుని, మెల్లగా బండి దిగాను. రెస్టారెంట్లో టిఫిన్ చేసి, బయటకు వచ్చేసరికి టైమ్ ఏడు దాటింది. ఆ రాత్రి స్టేషన్‌కు దగ్గర్లో ఉన్న లాడ్జిలో బస చేశాను. రోడ్డు క్రాస్ చేసి లాడ్జిలో అడుగు పెట్టే ముందు ఒక ఫ్రెండ్ కలిశాడు. ఎంతో ఆప్యాయంగా పలుకరించాడు. మా మాటల్లో నా చిన్ననాటి మిత్రుడు అంటే ఆడపిల్లలకు చదువులెందుకు అని ఎప్పుడూ నాతో వాదించే వీర్రాజు గురించి వాకబు చేశాను. వీర్రాజు వైజాగ్‌లోనే ఉంటున్నట్టు అతను చెప్పాడు.

లాడ్జిలో నిద్రపోయే ముందు, వీర్రాజుతో కలిసి చదువుకున్న రోజులు గుర్తుకు రావటంతో, ఆ రాత్రి చాలా సేపు మేల్కొనే వున్నాను.


000

ఆ మర్నాడు లాయర్ని కలుసుకున్నాను. నేను వచ్చిన పని తొందరగా అయిపోయింది. అందువల్లనే వెంటనే విజయవాడ వెళ్లాలనుకున్నాను. రిజర్వేషన్ దొరకలేదు. రాత్రి బయల్దేరే కోణార్క్‌లో రిజర్వేషన్ దొరికింది. సాయంత్రం నాలుగు గంటల వరకు లాడ్జిలోనే గడిపాను. వాతావరణం చల్లగా ఉంది. అయిదు గంటలకు లాడ్జి నుండి బయటపడ్డాను. మెల్లగా నడుచుకుంటూ సిటీ

వైపు దారి తీశాను. ఒక కమ్యూనిటీ హాలు కంటబడింది. అక్కడ ఏదో ప్రోగ్రామ్ జరుగుతూంది. మహిళాసమాజం ఆ కార్యక్రమం ఆర్గనైజ్ చేస్తున్నట్టు బయట అంటించిన వాల్ పోస్టర్ చూసి తెలుసుకున్నాను. లోపలికెళ్లి కూర్చున్నా.

వేదిక పైన నిలబడి మాట్లాడే వక్త ఎవరో కాదు, బెంగళూరు నుండి విశాఖపట్నం వరకు నాతో పాటు ఏసీ కోచ్‌లో ప్రయాణం చేసిన మాలతి! ఉపన్యాసంతో ఆమె ఆడిటోరియంలో ఉన్న ప్రేక్షకుల నందర్నీ ఆకట్టుకుంది. మాలతి ఉపన్యాసాన్ని శ్రద్ధగా విన్నాను.

'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అన్నారు పెద్దలు. ఒక స్త్రీ చదివితే ఆ కుటుంబం అంతా చదివినట్లే. ఆ రోజుల్లో ఆడపిల్లలు, మగపిల్లలతో కలిసి చదువుకోవటానికి తల్లిదండ్రులు సమ్మతించేవారు కాదు. విదేశీయుల పరిపాలన కాలంలో దేశంలో నెలకొన్న కులమతవిభేదాలు అందుకు కారణం కావచ్చు. రాజా రాంమోహన్ రాయ్, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం పంతులు గార్ల ప్రయత్నం ఫలితంగా, స్త్రీవిద్య ఊపందుకుంది. దేశజనాభాలో సుమారు యాభై శాతం వరకు ఉన్న మహిళలు... అంతా అక్షరాస్యులై ఉండాలి. విద్యను అభ్యసించటానికి స్త్రీలకు ఎన్నో అవకాశాలు కల్పిస్తోంది ప్రభుత్వం. తన స్థానాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవటానికి, ఆర్థికంగా తన కాళ్ల మీద తను నిలబడటానికి, జీవితంలో ఎదురైన ఒత్తిడులను ఎదుర్కొనే ఆత్మస్థైర్యం కలగటానికి, విద్య దోహదపడుతుందన్న నిజం ముఖ్యంగా గ్రామప్రజలకు తెలియజెప్పాలి. వారిని చైతన్యపరచాలి. ప్రజాస్వామ్యం విజయవంతం కావటానికి స్త్రీలు విద్యావతులై వుండాలి. ఇందుకుగాను ప్రభుత్వం ఎన్నో విధాల ప్రయత్నిస్తోంది. కాలేజీ ఫీజులలో రాయితీలు ప్రకటిస్తోంది. అక్షరాస్యలైన స్త్రీలకు ఉద్యోగావకాశాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. అందువల్ల నేటి స్త్రీలు చదువు సాగించటానికి ఎటువంటి ఇబ్బందులూ ఎదురవవని నా నమ్మకం—!'



మాలతి ఉపన్యాసానంతరం, సెక్రెటరీ వందనసమర్పణతో ఆ నాటి కార్యక్రమం ముగిసింది. మాలతిని అభినందించి రావాలని లేచి నిలబడ్డానో లేదో 'చక్రపాణీ!' అన్న పిలుపు నా చెవిని పడింది. వెనక్కి చూశాను. రెండు వరుసల వెనుక కుర్చీలో కూర్చున్న వ్యక్తి చేయూపుతూ, నన్ను రమ్మని సైగ చేయటం కనిపించింది. పిలుస్తున్నది ఎవరో వెంటనే గుర్తు పట్టలేకపోయాను. నిదానంగా చూసిన కొన్ని క్షణాలకు తెలుసుకోగలిగాను. అతనే నా బాల్యమిత్రుడు వీర్రాజు. అతనిలో చాలా మార్పు చోటు చేసుకుంది. మెల్లగా నడుచుకుంటూ వీర్రాజు దగ్గరకెళ్లాను. కుర్చీలో నుండి లేచి నిలబడి అమాంతంగా నన్ను వాటేసుకున్నాడు అతను.

'ఏమిటిలా వచ్చావ్? చాలా కాలానికి కనబడ్డావు. కూచో' అంటూ వీర్రాజు పక్క కుర్చీలో కూర్చున్నాడు.

'చిన్న పని మీద వచ్చాను. ఈ మధ్య రెండు మూడు సార్లు ఈ ఊరొచ్చాను.' వీర్రాజు పక్కన కూర్చుని చెప్పాను నేను.

'వచ్చి నన్ను కలుసుకోకుండా వెళ్లిపోయావా?' వీర్రాజు బాధపడ్డాడు.

'నిన్ను కలుసుకోవాలని ఎంతో ప్రయత్నించాను. ఒక్కోసారి ఫోను కలిసేది కాదు. మరోసారి ఫోను కలిసింది కానీ, నీ వైపు నుండి రెస్పాన్స్ లేదు. అది సరే, నువ్వు ఈ ప్రోగ్రామ్‌కి వచ్చావేంటి? స్త్రీవిద్యను సమర్థించే మనిషివి కాదు కదా నువ్వు?' నవ్వుతూ అన్నాను నేను.

వీర్రాజు నవ్వలేదు. అతని మొహం నిస్తేజంగా కనిపించింది. 'నువ్వన్నట్టు మొదట నేను అలాగే మాట్లాడేవాడిని. నువ్వు చెప్పింది కరెక్టే. అలా నీతో ఆర్గ్యూ చేసినందుకు ఆ తర్వాత నేను చాలా బాధపడ్డాను. లేనిపోనివి మనసులో పెట్టుకుని, మూర్ఖంగా పిల్లలను కాలేజీ చదువులకు పంపలేదు. యుక్తవయసు రాగానే పెద్దమ్మాయికి పెళ్లి చేశాను. పెళ్లి జరిగిన ఆర్నెల్లకే ఆమె భర్త ఏక్సిడెంట్లో కళ్లు మూశాడు. రెండో అమ్మాయి పరిస్థితి కూడా అలాగే తయారైంది. అంటే ఆమె భర్త చనిపోలేదు. చదువు లేని అమ్మాయిని చేసుకుంటే ఎక్కువ కట్నం వస్తుందన్న ఆశతో పెళ్లిచేసుకున్నాడట. కట్నం తెచ్చుకోని భార్య నాకెందుకని అమ్మాయిని వదిలేసి, ఎక్కడికో పోయాడు. ఈ రెండు సంఘటనలూ నన్ను దుఃఖసాగరంలో ముంచి వేశాయి. అమ్మాయిలిద్దరి బ్రతుకులూ, నా మూర్ఖత్వం వల్లే నాశనమైపోయాయని చాలా రోజులు నేను కుమిలిపోయాను. 'మా జీవితాలకు మీరు బాధ్యులు కారు, మీరు బాధపడకండి' అంటూ పెద్దమ్మాయి, పెద్ద చదువులకు శ్రీకారం చుట్టింది. దాని దీక్ష పట్టుదల చూసి నేనే ఆశ్చర్యపోయాను. పది సంవత్సరాల వ్యవధిలో డిగ్రీ వొక్కటే కాదు, పి.జీ. కూడా చేసి, ఆ తర్వాత డాక్టరేట్ పట్టానూ అందుకుంది. ప్రస్తుతం బెంగళూరులో ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేస్తూంది. ఈ నాటి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉండాలని ఇక్కడ మహిళాసమాజం వారు కోరటం, అందుకు ఆమె అంగీకరించి ఈ ఊరు రావటం జరిగాయి. ఆమె ఎవరో కాదు, నువ్విప్పుడు వేదిక మీద చూసిన మాలతి... డాక్టర్ మాలతి. ఆ మాలతే నా పెద్దకూతురు. ఆ రోజుల్లో నువ్వు చెప్పిన మాట వినకుండా, నేను చాలా తప్పు చేశాను. స్త్రీకి విద్య ఎంత అవసరమో ఇప్పుడు నాకు అర్థమైంది." వీర్రాజు కళ్లు చెమ్మగిల్లాయి.

'నో—నో వీర్రాజూ, ఇప్పుడు నువ్వు బాధ పడకూడదు. కంటతడి పెట్టకూడదు. నువ్వు నిజాన్ని గ్రహించావు. నీ కూతురు ప్రయోజకురాలైంది. ఐ యామ్ ప్రౌడాఫ్ యూ!' వీర్రాజు భుజాన్ని తట్టాను, సంతోషంగా.

'రెండో అమ్మాయి పార్వతి కూడా బాగా చదువుకుంది. ఈ ఊళ్లోనే లాయర్‌గా ప్రాక్టీసు పెట్టింది. చదువుకున్న స్త్రీలు వారి జీవితాలను మంచి మార్గాన నడిపించటమే కాదు, దేశపురోభివృద్ధికి కూడా తోడ్పడగలరని నా నమ్మకం" చెప్పాడు వీర్రాజు.

'చూశావా మరి? బాగా చదువుకున్నారు గాబట్టి, నీ పిల్లలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడగలుగుతున్నారు. మాలతి సభ్యత, సంస్కారం ఇప్పుడు కాదు, ట్రెయిన్‌లో చూసినప్పుడే నాకు అర్థమయ్యాయి" అన్నాను నేను.

'సరే—పద, పిల్లలిద్దర్నీ చూపిస్తాను.'

వీర్రాజు నన్ను వేదిక వైపు తీసుకువెళ్లాడు.